క్లుప్తంగా

రాజమహేంద్రవరం నుంచి రాములోకి దర్శనానికి..

అయోధ్యకు యువకుల బైక్ ర్యాలీ



యువకుల అయోధ్య యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: దేశ జనాభాలో 60 శాతం మంది యువకులు ఉన్నారని, వీరంతా దేశాభివృద్ధికి పాటుపడాలని ఎంపీ భరత్‌రామ్ పిలుపునిచ్చారు. బుధవారం రాజమహేంద్రవరం పుష్కరఘాట్ నుంచి మోటార్ సైకిళ్లపై అయోధ్యకు బయలు దేరిన తాడేపల్లిగూడేనికి చెందిన ప్రణీత్, కాకినాడకు చెందిన తేజ్ తరుణ్ యాత్రను ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్న యువతను స్ఫూర్తిగా తీసుకుని అంతా ముందుకు సాగాలన్నారు. అయోధ్య ప్రయాణం దిగ్విజయం కావాలని ఆకాంక్షించారు. అనంతరం యాత్రకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల్లో అయోధ్య చేరుకుంటామని ఆ యువకులు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, మిత్రులతో మాట్లాడటమే కాకుండా యూట్యూబ్ ద్వారా ప్రజలకు తమ ప్రయాణ వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

కొనసాగిన బైబిల్ మిషన్ మహాసభలు



బైబిల్ మిషన్ మహాసభలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్ గ్రౌండ్స్‌లో బైబిల్ మిషన్ 57వ మహాసభల్లో భాగంగా రెండో రోజు బుధవారం కార్యక్రమాలను రెవ పి.ప్రభుదాసు ప్రార్థనతో ప్రారంభించారు. బైబిల్ మిషన్ ఉపాధ్యక్షుడు ఎం.దేవదాసు, ఎ.దైవారావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. బైబిల్ మిషన్ అధ్యక్షుడు పి.సంజీవరావు, సభల కన్వీనర్ ఎస్‌జే షారోన్‌కుమార్ సందేశం అందించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను క్రైస్తవులంతా ఆశీర్వదించాలన్నారు. ఎస్.సుధాకర్, జీఆర్ ఇమ్మానియేలు రాజు, వై.ఇమ్మానియేలు, సుదన్ షారోన్, లాలేటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

కడియం: ఎన్నికల కోడ్ వెలువడిన తరువాత ఎన్నికల నియమావళి మేరకు విధులు నిర్వహించాలని సిబ్బందికి ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల కోడ్‌కు సంబంధించిన పలు అంశాలను వివరించారు. విధి నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలను తెలిపారు. కోడ్ అమలులోకి వచ్చిన తరువాత నేతల విగ్రహాలకు ముసుగులు వేయడంతోపాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకుల చిత్రపటాలు కనిపించకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఫ్లెక్సీల తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల నిబంధనల పట్ల ఎలాంటి అలసత్వం వహించినా తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సెల్ ఫోన్ల డీపీలు, సోషల్ మీడియాలో డీపీలుగా రాజకీయ నాయకుల ఫోటోలు పెట్టుకుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని పలువురు అన్నారు. బుధవారం వేమగిరి సచివాలయం- 1 పరిధిలో ఏర్పాటైన ఆరోగ్య శిబిరంలో 378 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో ప్రభుత్వ వైద్యులు ఎన్.నాగసాయిమౌర్య, ఎం.మణిజ్యోత్స్న, ఆర్థోపెడీషియన్ కె.ప్రణయ్, యురాలజిస్ట్ బి.నితీష్, రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కంటి వైద్య విభాగం వైద్యులు సేవలందించారు. 46 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఒకరిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ అందించారు. ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ శిబిరాన్ని పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి కె.రాజశేఖర్, వైద్య, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గేష్‌ను కలసిన గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ- జనసేన పార్టీల మధ్య రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయం ఒక కొలిక్కి రావడంతో బుధవారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఇరుపార్టీలూ కలసి పనిచేస్తాయన్నారు.

పాలనలో సరికొత్త అధ్యాయం

- సీఎం జగన్‌తో పేదల సంక్షేమం
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- బొమ్మూరులో అభివృద్ధి పనుల ప్రారంభం



బొమ్మూరులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి వేణుగోపాలకృష్ణ



వైఎస్సార్ సీపీలో చేరిన శ్యామలరావు తదితరులతో మంత్రి వేణుగోపాలకృష్ణ, గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని, తద్వారా పేదలు ఆర్థికంగా బలోపేతం అయ్యారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం రూ.2.34 కోట్లతో బొమ్మూరులో సచివాలయం-1 పరిధిలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, సచివాలయం-4 పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయం-3 పరిధిలో సచివాలయ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అలాగే ఉపాధి హామీ నిధులు రూ.కోటితో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి మంత్రి వేణు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఈ రెండు వ్యవస్థలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో ఈ ప్రాంతాన్ని పాలకులు పట్టించుకోలేదన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. ప్రస్తుతం బొమ్మూరులో రూ.3.24 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనను రూరల్ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా పంపిన 40 రోజుల్లోనే సుమారు రూ.35 కోట్లతో సంక్షేమంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. తాను పాలకుడిని కాదని ప్రజా సేవకుడినని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఏఈ సంపత్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఎ.భీమరాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీను, సచివాలయ కన్వీనర్లు యెనుముల త్యాగరాజు, మేడపాటి సద్గుణరామారెడ్డి, ఎలుగొండ లక్ష్మి, సోమన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

నగరపాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మిరపల శ్యామలరావు, ఆయన భార్య ప్రముఖ న్యాయవాది పద్మావతి, కొల్లి దీపు, అతని మిత్ర బృందం, అధికసంఖ్యలో మహిళలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక ఇన్నీసుపేటలో జరిగిన కార్యక్రమంలో మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిరపల శ్యామలరావు దంపతులకు, కొల్లి దీపు,అతని మిత్ర బృందానికి పార్టీ కండువాలను మంత్రి వేణు, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ యువజన విభాగ రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వేసి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి వేణు మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, దమ్ము ప్రసాద్, చాపా రాజా, రాయుడు కాకా, కుడుపూడి గిరి పాల్గొన్నారు.

నేడు సొసైటీ శాఖ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, రాజమహేంద్రవరం బ్రాంచ్‌ను గురువారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రారంభిస్తారని ముఖ్య కార్య నిర్వహణాధికారి గుళ్లపల్లి నాగసాయి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం జీవీఎస్ అప్పారావు వీధి, వాద్రేవు నగర్, తిలక్ రోడ్డులో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ 16వ శాఖ ప్రారంభం కానుందన్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ వి.అనంత రామకృష్ణ ప్రసాద్ (అమ్మా ప్రసాద్), ఎంపీ మార్గాని భరత్‌రామ్, హోం మంత్రి తానేటి వనిత, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ చైర్మన్ పేరి కామేశ్వరరావు తదితరులు హాజరవుతారన్నారు.

సభ విజయవంతం చేయాలి

ప్రకాశంనగర్: ఈ నెల 14న ఢిల్లీలో జరిగే కిసాన్ మజ్దూర్ మహా పంచాయతీ సభకు అఖిల భారత రైతు కూలీ సంఘ కార్యకర్తలు, రైతులు, కూలీలు, కార్మిక సంఘాలు, ఉద్యోగులు తరలిరావాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్, గోకవరం బస్టాండ్, దేవీ చౌక్ సెంటర్‌లో ప్రచార సభలు నిర్వహించారు. వెంకట్ నాయుడు మాట్లాడుతూ అన్ని పంటలకు కనీస మద్దతు ధర, సమగ్ర రుణమాఫీ అమలు చేయాలన్నారు. సంఘ జిల్లా నాయకులు పాలెపు రామారావు, దుర్గారావు, భవాని, నాగమణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వినతి

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ పరిధిలోని మున్సిపల్ ప్రాథమిక, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల జీతాలు విడుదల చేయాలంటూ ఏపీటీఎఫ్ సభ్యులు బుధవారం అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ ఇది రాష్ట్ర స్థాయిలో ఏర్పడిన టెక్నికల్ సమస్య అని, తన డీడీఓ పరిధిలో జీతాల పద్దుకు సంబంధించి హెడ్‌ల మ్యాపింగ్ జరగాలన్నారు. ఆ ప్రక్రియ జరుగుతోందని, ఇప్పటికే ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. రెండు రోజుల్లో పరిష్కారం అవుతుందన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు అప్పయ్య శాస్త్రి, నగర శాఖ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్ పాల్గొన్నారు.

గోదావరి రేవులో శ్రమదానం



నదిలో వ్యర్థాలను తొలగిస్తున్న గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి ఘాట్‌లలో పుణ్యస్నానాలు చేసే భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేందుకు రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి కృషి చేస్తుందని చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఉమామార్కండేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న రేవులో పేరుకుపోయిన వ్యర్థాలను గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగే శివరాత్రికి ఉమా మార్కండేయస్వామి గుడి ఎదురుగా ఉన్న రేవును శుభ్రం చేశామన్నారు. గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు ఎస్‌వీవీ రెడ్డి, ఎస్.అప్పారావు, కొంచాడ ఈశ్వర్, బి.అప్పారావు, ఎల్‌వీ ప్రసాద్, దేశిరెడ్డి బలరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధ తీసుకోండి.. శుభ్రంగా ఉంచండి

- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ భరత్‌రామ్
- శివరాత్రికి ఘాట్‌ల వద్ద ఏర్పాట్లపై సూచన



ఘాట్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిలో పుణ్యస్నానాలు చేసేందుకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శ్రద్ధ తీసుకోవాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ఇరిగేషన్, నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కోటిలింగాల ఘాట్, పుష్కర తదితర ఘాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘాట్ల వద్ద చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. స్నానాలు చేసేటప్పుడు షాంపులు, సబ్బులు వినియోగించకుండా ఆర్ఎంసీ సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. భక్తులకు సేవా సంస్థలు, స్కౌట్, ఎన్‌సీసీ తదితర విద్యార్థులు అవగాహన కల్పించాలని చెప్పారు. మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లను సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వృద్ధులు, వికలాంగులను దృష్టిలో ఉంచుకుని ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి నదిలో బారికేడ్లు, బోట్లు, గజ ఈతగాళ్లతో భక్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. 41, 23వ వార్డుల ఇన్‌చార్జులు సుభాష్, వాకచర్ల కృష్ణ, టీకే విశ్వేశ్వరరెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, బర్రే కొండబాబు, ఆర్ఎంసీ ఈఈలు శేషగిరిరావు, అలీ, ఎంహెచ్‌ఓ వినూత్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభ్యున్నతికి కృషి

ప్రకాశంనగర్: క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల క్రీడా మైదానంలో ఇంటర్ కాలేజియేట్, హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ ఎంపిక పోటీలు నిర్వహించారు. వీటిని ఎంపీ ప్రారంభించి మాట్లాడుతూ నగరంలో స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీతనబోయిన సాయిరాం మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో సాగాలన్నారు. ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు, ఆధ్యాత్మికవేత్త తోట సుబ్బారావు, సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిశోర్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ బి.రామ్‌గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఏ కిశోర్‌బాబు, హ్యాండ్ బాల్ అబ్జర్వర్ సీహెచ్ అంజిబాబు, ఫుట్‌బాల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సిరా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అరిపిరాల కృషి అభినందనీయం



అరిపిరాల నారాయణరావును సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రకాశంనగర్: గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో సౌకర్యాల కల్పనతో పాటు ప్రాచీన గ్రంథాలను డిజిటలైజేషన్ చేసిన అరిపిరాల నారాయణరావు సేవలు అభినందనీయమని పలువురు వ్యక్తులు కొనియాడారు. బుధవారం స్థానిక గౌతమీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షత వహించి, గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దీక్షితులుకు డిజిటలైజేషన్ హార్డ్ డిస్క్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయంపై మమకారంతో సమయాన్ని, ధనాన్ని వెచ్చించి ప్రాచీన గ్రంథాల పరిరక్షణ కోసం డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టి పూర్తి చేయడం అభినందనీయమన్నారు. దీక్షితులు మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలను డిజిటలైజేషన్ చేయడం ఆనందంగా ఉందన్నారు. వెబ్ సైట్‌లో పెట్టడానికి శాఖా పరంగా ప్రయత్నాలు చేస్తామన్నారు. అపిరాల నారాయణరావు మాట్లాడుతూ రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకొళ్లపు శివ రామసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ ప్రసాదుల హరినాథ్ వంటి ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రంథాలయం అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం గ్రంథాలయ లైబ్రేరియన్ ఘంటా శ్రీదేవి ఆధ్వర్యంలో నారాయణరావును సత్కరించి, జ్ఞాపిక ఇచ్చారు. పాత్రికేయుడు కృష్ణకుమార్ పాల్గొన్నారు.

పుణ్యస్నానాలకు ఇబ్బంది రానీయొద్దు



శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: శివరాత్రిని పురస్కరించుకుని ఘాట్‌లు, ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. శివరాత్రికి ఘాట్లలో ఏర్పాట్లపై బుధవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి ఘాట్లలో ఏర్పాటు చేసిన బోట్లలో తప్పనిసరిగా ఈతగాళ్లు అందుబాటులో ఉండాలన్నారు. వారి వద్ద లైఫ్‌జాకెట్లు ఉండేలా చూడాలన్నారు. రేవుల వద్ద ప్రకటన బోర్డులను నిశితంగా పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న బోర్డులను తొలగించాలని ఆదేశించారు. కోటిలింగాలరేవులో కోటిలింగేశ్వర స్వామి ఆలయం వద్ద రథయాత్ర జరుగుతుందని, అక్కడ తొక్కిసలాట జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పిండ ప్రదానాలు, దానాలు చేసి భక్తులు వదిలేసిన సరకులను వెంటనే తొలగించాలని, అన్ని ఘాట్లలో తగినన్ని డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. శివరాత్రి రోజున ఉదయం 3 గంటల నుంచి అధికారులంతా విధుల్లో నిమగ్నం కావాలని కోరారు. అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమణ, మున్సిపల్ ఆరోగ్య అధికారి ఎ.వినూత్న, అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతిష్ఠాత్మకంగా జరిగే శివరాత్రి మహోత్సవాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను భక్తితో జరుపుకోవాలన్నారు. అశ్లీల నృత్యాలు, జూద క్రీడలు వంటివి నిషేధమన్నారు. ప్రసాదాలు పంచి పెట్టే సమయంలో ఎటువంటి అంతరాయం జరగకుండా తగిన వలంటీర్లు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను ఆలయాల ధర్మకర్తలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఘాట్‌ల వద్ద స్నానాలు, ఆలయాల వద్ద దర్శన సమయంలో విలువైన వస్తువులు, సామాన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. చిన్నపిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై స్థానిక పోలీస్ స్టేషన్, డయల్ 100, 112 నంబర్లకు తెలియజేయాలన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



దుళ్లలో రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు

కడియం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం అయ్యిందని దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య అన్నారు. మండలంలోని దుళ్ల, పొట్టిలంక గ్రామాల్లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సర్వహక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. దుళ్లలో సర్పంచ్ పట్టియ్య ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో పేదలకు మేలు జరిగిందన్నారు. ఏ రాష్ట్రంలో అమలు చేయలేని పథకాలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. అనంతరం ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన 226 మంది లబ్ధిదారులకు పత్రాలను సర్పంచ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, నాయకులు పిచ్చుక వెంకటరావు, అయిల లక్ష్మణ్, కోసూరి లక్ష్మీనారాయణ, కాలేపు చెల్లారావు, వట్టి శివ, వీఆర్వో ఐ.బుజ్జి తదితరులు పాల్గొన్నారు. పొట్టిలంక గ్రామ పరిధిలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు 178 మందికి సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భూ సర్వహక్కుల పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు అనేక పథకాలు అందించి సీఎం జగన్‌కు అందరి హృదయాల్లో చోటు పొందారన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నక్క చంటిబాబు, కర్ర ముక్తేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టిలంకలో లబ్ధిదారులతో నాయకులు, తదితరులు

రేపు శివరాత్రి జాగరణ



శివరాత్రి జాగరణ జరిగే ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

రాజానగరం: శివరాత్రి అనగానే తమిళనాడులోని కోయంబత్తూరులో ఇషా ఫౌండేషన్ సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆధ్వర్యంలో జరిగే జాగరణోత్సవం గుర్తుకొస్తుంది. ఇంచుమించు అదే తరహాలో రాజానగరంలో శివరాత్రి జాగరణ మహోత్సవాన్ని నిర్వహించాలని మండల ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు, రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు మండవల్లి వెంకటేశ్వరరావు దంపతులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఇక్కడ విలేకరులకు వివరించారు. శని త్రయోదశితో కూడిన మహాశివరాత్రి 12 పుష్కరాలకు ఒకసారి వస్తుందని, ఈ సారి ఆ అవకాశం రావడంతో తాను ఈ కార్యక్రమానికి సంకల్పించానన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి మర్నాడు తెల్లవారుజాము వరకూ శివరాత్రి జాగరణ మహోత్సవాలు జరుగుతాయన్నారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్‌కు సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సుమారు 30 ఎకరాల ఖాళీ స్థలంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాయంత్రం 4 గంటలకు గ్రామంలోని పురాతన ప్రసిద్ధి చెందిన రాజలింగేశ్వర స్వామి ఆలయం నుంచి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పుంగునూరు గిత్తల బండిపై ఉంచి, 1,116 మందితో కూడిన కోలాట ప్రదర్శనలతో ఊరేగింపుగా జాగరణోత్సవం జరిగే ప్రాంగణానికి తీసుకువస్తారన్నారు. అనంతరం కల్యాణోత్సవం, ఏకాదశ మహా రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, సహస్ర కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, మంగళ హారతి జరుగుతాయి. కల్యాణోత్సవ సమయంలో 108 కిలోల ముత్యాల తలంబ్రాలు (బియ్యం) సమర్పిస్తారు. సుమారు 15 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో కళాకారులచే సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు దంపతులచే అఖండ శంఖారావం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కాగా ఈ కార్యక్రమానికి ఎంట్రీ ఫీజు రూ. 99 చెల్లించాలని, ఆ మొత్తానికి సమానమైన విలువ చేసే బహుమతిని ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. సమావేశంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా, కార్యదర్శి అనుకుమార్, సభ్యులు గ్రంధి రాజా, కంకటాల సత్యనారాయణ మూర్తి, యోగ రమణ, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రయోజనం



కడియంలో పాల సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

కడియం: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రవేశపెట్టిన జగనన్న పాలవెల్లువ పథకం కింద పాల సేకరణ కేంద్రాలు కడియం మండలంలో బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి దశలో భాగంగా కడియంతో పాటు, జేగురుపాడు, వేమగిరి గ్రామాల్లో సేకరణ కేంద్రాలు ప్రారంభించి పాలు సేకరించారు. ఆయా గ్రామాల్లోని ఈ కేంద్రాలను ఎంపీడీఓ జి.రాజ్ మనోజ్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారానికి సంబంధిత సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు మునుపెన్నడూ లేని విధంగా ఈ పథకం ద్వారా గిట్టుబాటు ధర దక్కుతుందన్నారు. నాణ్యమైన పాలను మాత్రమే రైతులు సరఫరా చేయాలన్నారు. ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతులు తీసుకొచ్చిన పాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాల్లో టెస్టు చేసి అక్కడికక్కడే ఎంత గిట్టుబాటు ధర వస్తుందో తెలియజేస్తారని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ జి.రవివర్మ, ఏపీఎం అప్పలకొండ, కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ ఏవీఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.